ఈ- పంట.. నమోదు చేసేదెట్టా!

- ఈ క్రాప్ యాప్‌లో కానరాని సర్వే నంబర్లు
- ఈనెలాఖరుతో ముగియనున్న పంట నమోదు ప్రక్రియ
- ఆందోళన చెందుతున్న రైతులు


ముదిగుబ్బ మండలంలో ఈ క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

నల్లమాడ: రైతులు సాగుచేసిన ఏదేని పంట వర్షాభావ పరిస్థితులు, విపరీతమైన తెగుళ్ల కారణంగా దెబ్బతింటే రైతులకు పరిహారం లేదా బీమా సాయం అందించేందుకు వీలుగా ప్రభుత్వం ఈ పంట నమోదు కార్యక్రమం చేపడుతోంది. రైతు పేరు, ఏ పంట, ఎంత విస్తీర్ణంలో సాగుచేశారు, భూమి సర్వేనంబర్. తదితర అంశాలను ఈ పంట నమోదులో పొందుపరుస్తారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో బోరు బావుల కింద రైతులు పలు రకాల పంటలు చేశారు. పంట సాగుచేసిన భూమి సర్వే నంబర్ ఈ పంట నమోదులో కన్పించకపోవడంతో పంట నమోదు చేయించుకోలేక రైతులు ఆందోళన చెందుతున్నారు. సర్వే నంబర్ హోల్డ్‌లో పడిందని, రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లాలని పంట నమోదు చేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులు చెబుతుండగా ఇందులో తమ ప్రమేయం ఏమీ లేదని రెవెన్యూ అధికారులు సమాధానమిస్తున్నారు. ఫలితంగా రైతులు అయోమయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

ముగియనున్న గడువు..

ప్రభుత్వం తిరిగి గడువు పొడిగిస్తే తప్ప ఈ పంట నమోదు ప్రక్రియ ఈనెలాఖరుతో ముగియనుంది. అంతలోపు తాము సాగుచేసిన పంటల నమోదు పూర్తవుతుందో, లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 12,485 ఎకరాలు కాగా ఈయేడాది ఇప్పటివరకు 5,130 ఎకరాల్లో పంటల సాగు జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారుల సమాచారం. ఇప్పటివరకు ఈ పంట నమోదు ఎంత శాతం పూర్తయినది అధికారులు కచ్చితంగా చెప్పకపోగా మూడు వేల ఎకరాల్లో వేరుశనగ, వెయ్యి ఎకరాల్లో మామిడికి సంబంధించి ఈ పంట నమోదు పూర్తయినట్లు మండల వ్యవసాయాధికారి అబ్దుల్ హక్ తెలిపారు. ఇందులో దీర్ఘకాలిక పంట అయిన మామిడిని మినహాయిస్తే తక్కిన 2,130 ఎకరాల్లో సాగైన వివిధ పంటలు, ఈ పంట నమోదు యాప్‌లో కానరాని సర్వే నంబర్ల సంగతి ఏమిటన్న ప్రశ్న రైతుల నుంచి ఎదురవుతోంది. మండలంలో నమోదైన పంటల వివరాలు క్రింది విధంగా ఉన్నాయి.

నల్లమాడ మండలంలో పంటల సాగు వివరాలు..

పంటరకం	విస్తీర్ణం (ఎకరాల్లో)
వరి	512.5
మొక్కజొన్న	520
వేరుశనగ	3,737.5
సజ్జ	120
టమాట	125
ఆముదం	15

ఐదెకరాల్లో పంట వేస్తే అర ఎకరం చూపిస్తోంది



రెడ్డిపల్లి రెవెన్యూ పొలంలో నాకు చెందిన సర్వేనం 82-3లో 4-49 సెంట్లు, సర్వేనం. 80-2లో 0-51 సెంట్లు మొత్తం ఐదెకరాల్లో కట్టుగుత్తకు ఇచ్చి వేరుశనగ పంట సాగు చేయించా. ఈ పంట నమోదు యాప్‌లో కేవలం 0-51 సెంట్లు మాత్రమే సూచిస్తోంది. తక్కిన 4-49 సెంట్లు చూపించడం లేదు, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సమస్యకు పరిష్కారం చూపాలి.
–సానే శివశంకర్‌రెడ్డి, న్యాయవాది, బాపనకుంట

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు



ఈ పంట నమోదు యాప్‌లో సర్వే నంబర్లు కన్పించడం లేదని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సిస్టం మారినందున మొత్తం సర్వే నెంబర్లు డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో కొన్ని సర్వే నంబర్లు మిస్ అయి ఉండొచ్చు. వాటిని కూడా డౌన్‌లోడ్ చేసుకొని సకాలంలో సమస్యను పరిష్కరిస్తాం.
–అబ్దుల్ హక్, మండల వ్యవసాయాధికారి, నల్లమాడ

క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు


జగన్‌కు ఆల్బమ్‌ను చూపుతున్న మీసాల కేశవరెడ్డి

తాడిమర్రి: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మద్దులచెర్వు గ్రామానికి చెందిన మీసాల కేశవరెడ్డి, టీవీ ఆదికేశవరెడ్డి గురువారం తాడేపల్లిలో కలిశారు. ఈసందర్భంగా మీసాల కేశవరెడ్డి తనకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌తో ఉన్న అనుబంధాన్ని తెలిపే ఫొటోలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చూపించారు.

యూరియా పంపిణీ

ఎన్పీకుంట: మేకలచెరువు, మరికొమ్మదిన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో గురువారం యూరియా పంపిణీ చేశారు. ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున 280 మంది రైతులకు 560 బస్తాలు పంపిణీ చేసినట్లు తహసీల్దార్ దేవేంద్రనాయక్, ఏఓ లోకేశ్వరరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వలిబాషా, ఆర్‌ఎస్‌కె సిబ్బంది ఉన్నారు.

ఘనంగా ప్రపంచ వెదురు దినోత్సవం


వెదురు దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పుట్టపర్తి: బుక్కపట్నంలో మేదర కులస్తులు గురువారం ప్రపంచ వెదురు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మేదర సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున మాట్లాడుతూ తమ కులాన్ని ప్రభుత్వం ఎస్టీల్లో చేర్చాలన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో మేదర కులస్తులకు కమ్యూనిటీ భవనం నిర్మించాలన్నారు. సబ్సిడీ రుణాలు ఇవ్వాలని, మేదర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాగరాజు, రామచంద్ర, రాధమ్మ, జ్యోతి, సాయిలీల తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ


బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు

కదిరి అర్బన్: అనంతపురంలో ఈ నెల 13న జరిగిన జేకేఎంఎస్ నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో బ్లూమూన్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు సిరి, నిఖిత కటా, కుమితే విభాగాల్లో రెండు బంగారు, రెండు వెండి పతకాలు సాధించారు. తమ కళాశాల విద్యార్థులు జాతీయస్థాయిలో పతకాలు సాధించినందుకు గర్వకారణంగా ఉందని బ్లూమూన్ విద్యాసంస్థల అధినేత శివశంకర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, పీడీ రాఘవరెడ్డి, కరాటే మాస్టర్ షేక్షావలి పాల్గొన్నారు.

దాడిచేసిన వారిని అరెస్టు చేయాలి

ధర్మవరం: సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని సీపీఎం నాయకులు ఎస్‌హెచ్ బాషా, సీఐటీయూ కోకన్వీనర్ అయుబ్‌ఖాన్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈఎస్ వెంకటేష్‌పై బుక్కపట్నంలో దాడి చేసిన వెలుగు సీసీ రవీంద్ర, బుక్ కీపర్ నాగరాజుపై పోలీసులు కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. చేనేత కార్మిక సంఘం పట్టణాధ్యక్షుడు ఖాదర్‌బాషా, కార్యదర్శి గుంపు హరి, వెంకటస్వామి, ఇంతియాజ్, బాబావలి పాల్గొన్నారు.

సర్వేలను పూర్తి చేయాలి

ముదిగుబ్బ: ప్రభుత్వ సర్వేలను గడువు లోపు పూర్తి చేయాలని తహసీల్దార్ నారాయణస్వామి వీఆర్‌ఓలకు సూచించారు. సుమోటో అప్లికేషన్స్, పీజీఆర్ఎస్, హౌస్ సైట్స్ వెరిఫికేషన్ ఫీల్డ్‌కు వెళ్లి నిర్వహించాలన్నారు. ఎఫ్ఎంసీ ధ్రువీకరణలో జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. మండలంలో 27 రెవెన్యూ గ్రామాల్లో కొండగట్టుపల్లి మినహా అన్నింటా స్వమిత్వ సర్వే పూర్తయిందని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన మానిటరింగ్ కమిటీ సభ్యులు

ప్రశాంతి నిలయం: శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్‌ను జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కలిశారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలసి పూలమొక్కలు అందజేశారు. కార్యక్రమంలో సభావత్ శ్రీనివాస నాయక్, ఉమాశంకర్, చెరుకూరి గంగులయ్య, వీరనారాయణ, పుట్టపర్తి సబ్‌డివిజన్ డీవీఎంసీ సభ్యులు గంగాధర్, రామాంజినేయులు, రాంప్రసాద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి యువత ముందుండాలి


మాట్లాడుతున్న ప్రభుత్వ వైద్యురాలు శ్వేత

ధర్మవరం అర్బన్: రక్తదానానికి యువత ముందుండాలని ప్రభుత్వ వైద్యురాలు శ్వేత తెలిపారు. స్థానిక కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నేతృత్వంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన విద్యార్థులకు రక్తదానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు గోపాల్‌నాయక్, షమీవుల్లా, పావని, కిరణ్‌కుమార్, భువనేశ్వరి, పుష్పావతి, ఆనంద్, సరస్వతి, మీనా, ధనుంజయ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కదిరిటౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం మున్సిపల్ మేనేజర్ ఆరీఫ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12వ పీఆర్‌సీని ప్రకటించాలని, మున్సిపల్ కార్మికులకు పీఆర్‌సీ ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. మరణించిన కార్మికుల కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు జనార్దన్, తిరుపాలు, సీఐటీయూ నాయకులు సాంబశివ, జగన్‌మోహన్, రామ్మోహన్, రఫీ పాల్గొన్నారు.

'చలో మెడికల్ కాలేజీ'కి తరలిరండి


మాట్లాడుతున్న విద్యార్థి విభాగం అధ్యక్షులు చైతన్యరెడ్డి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్రనేత రాజేంద్రప్రసాద్

బత్తలపల్లి: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం తలపెట్టిన చలో పెనుకొండ మెడికల్ కాలేజీ కార్యక్రమానికి విద్యార్థులు, యువత తరలిరావాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షులు కె.చైతన్యరెడ్డి కోరారు. గురువారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కమీషన్ల కోసం 10 మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించడం అన్యాయమన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ప్రజా సంఘాల నాయకులు అందరూ వ్యతిరేకించాలని కోరారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని లేని పక్షంలో అన్ని విద్యార్థి, ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో విద్యార్థి సంఘం నాయకులు గుజ్జల అనిల్‌కుమార్, రామాంజనేయులు, లోకేష్‌రెడ్డి, లోకేష్ పాల్గొన్నారు.

కదిరి అర్బన్: కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రవేటీకరించడాన్ని నిరసిస్తూ చలో పెనుకొండ మెడికల్ కాలేజీ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్ కోరారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జగనన్న నిరుపేద విద్యార్థులకు వైద్య విద్యనందించాలనే సదుద్దేశంతో 17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి అనుమతులిచ్చి అందులో 7 కళాశాలలు పూర్తి చేశారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరిస్తోందని, వెంటనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థి విభాగం పట్టణాధ్యక్షుడు నిఖిల్‌రెడ్డి, రమేష్‌యాదవ్, బాబా, ఫయాజ్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

ఓడీచెరువు: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ శుక్రవారం తలపెట్టిన చలో పెనుకొండ మెడికల్ కాలేజ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షులు డాక్టర్ రమేష్ కోరారు. డాక్టర్ల విభాగం, యువజన విభాగం, విద్యార్థి విభాగం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

మహిళల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు


బుక్కపట్నం మండలం దూపంపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ సురేష్, సిబ్బంది

ఎన్పీకుంట: గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తగా కాపాడుకోవాల ని మండల వైద్యాధికారి డాక్టర్ బాలాజీనాయక్ సూచించారు. వెలిచలమల గ్రామంలో గురువారం స్వస్థ్ నారీ – స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నాగలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ మహేశ్వరరెడ్డి, మలేరియా సబ్‌యూనిట్ రామాంజులు, బాషా, ఆరోగ్యకార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం దూపంపల్లిలో గురువారం స్వస్థ్ నారీ సశక్తి అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని బుక్కపట్నం ప్రభుత్వ వైద్యుడు సురేష్ తెలిపారు.

తాడిమర్రి: నాయనపల్లి గ్రామంలో గురువారం ఆమె స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి హరిత వృద్ధులు, బాలింతలు, గర్భిణీలకు వైద్య పరీక్షలు మందులు పంపిణీ చేశారు. సీహెచ్ఓ ధరణి బాయ్, ఏఎన్ఎం రేణుక, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే దాడితోట, కునుకుంట్ల జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆఫ్తాలమిక్ ఆఫసర్ ఉరుకుందప్ప, ఎంపీహెచ్ఎస్ రామ్ కుమార్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: యర్రదొడ్డి గ్రామంలో శుక్రవారం పట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డా. వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం జరిగింది. గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న మహిళలకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ధర్మవరం రూరల్: వసంతపురం గ్రామంలో గురువారం డాక్టర్ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ దిలీప్‌కుమార్ రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. సీహెచ్ఓ సాంబ శివమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముదిగుబ్బ: పొడరాళ్లపల్లి గ్రామానికి చెందిన నారాయణస్వామి (65)అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాలు..నారాయణస్వామి మంగళవారం రాత్రి ముదిగుబ్బ నుంచి గుంజేపల్లికి బైక్‌పై వెళ్తుండగా రోడ్డు డివైడర్‌ను ఢీకొన్నాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని అనంతపురం తరలించారు. చికిత్స ఫలించకపోవడంతో అక్కడే మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నారు.

నేడు మండల మీట్

బత్తలపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహ నాయుడు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

దస్తావేజు లేఖరుల సంఘం నూతన కమిటీ ఎన్నిక


నూతన కమిటీ సభ్యులు

ధర్మవరం: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద గురువారం దస్తావేజు లేఖరుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. దస్తావేజు లేఖరుల సంఘం అధ్యక్షుడిగా క్రిష్ణాపురం జావీద్‌బాషా, ఉపాధ్యక్షుడిగా భాస్కర్, కార్యదర్శిగా మహేంద్ర, జాయింట్ కార్యదర్శిగా తొండమాల నాగార్జున, ట్రెజరర్‌గా మల్లికార్జుననను ఎన్నుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

పుట్టపర్తి: సమస్యలు పరిష్కరించాలంటూ వీఆర్‌ఏలు గురువారం బుక్కపట్నం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా ఆ సంఘం నాయకుడు నరసింహులు మాట్లాడుతూ పేస్కేలు అమలు చేయాలని, నామినీలను వీఆర్‌ఏలుగా నియమించాలన్నారు. అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. శుక్రవారం కూడా ధర్నా కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

ముదిగుబ్బ: డిమాండ్లను పరిష్కరించాలంటు తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్‌ఏలు నిరసన దీక్ష చేపట్టారు. వీరికి సీపీఎం, సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ నారాయణస్వామికి అందజేశారు.

నల్లచెరువు: వేతనాలు పెంచాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం వీఆర్‌ఏలు నిరసన తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీటీ రవి నాయక్‌కు అందజేశారు. వీఆర్‌ఏలు పతి, రవి, శ్రీనివాసులు, రమణ, మారుతీ. వెంకటదాస్, అంజలీ బాయి, అంజనమ్మ పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కరించాలని కోరుతూ మండలంలోని అన్ని గ్రామాల వీఆర్‌ఏలు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు గురువారం అందజేశారు. వీఆర్‌ఏ సంఘం నాయకులు ఆంజనేయులు, ఓబుళపతి, లింగన్నలు మాట్లాడుతూ వీఆర్‌ఏగా విధులు నిర్వహించే వారు మరణిస్తే వారి కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, డీఏ పెంచాలన్నారు. డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

టీకాతో 'గాలికుంటు' నివారణ

బత్తలపల్లి: టీకాలతో పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణ సాధ్యమవుతుందని మండల పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి అన్నారు. గురువారం యత్రాయపల్లి గ్రామంలో 275 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నాలుగు నెలలు వయస్సు పైబడిన అన్ని పశువులకు సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 15 వరకు నెల రోజులు పాటు ఉచితంగా పశువులకు టీకాలు వేస్తామన్నారు. మండల ఆర్ఎస్కే సిబ్బంది, ఏహెచ్ఏలు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

పోస్టల్ ఇన్సూరెన్స్‌తో భరోసా

తాడిమర్రి: పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌తో మృతుల కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ మూర్తి తెలిపారు. స్థానిక పోస్టాఫీసులో గురువారం ఆయన పోస్టల్ సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పాలసీదారులు అకస్మాత్తుగా మృతి చెందితే వారి కుటుంబానికి ఇన్సూరెన్స్ మొత్తం చెల్లిస్తామని ఆయన తెలిపారు. పోస్టుమాస్టర్ శివకుమార్ పాల్గొన్నారు.

యూరియా సమస్య పరిష్కరించాలి

కదిరిటౌన్: కొన్ని రోజులుగా యూరియా సమస్యతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సమస్య పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం తహసీల్దార్ మురళీకృష్ణకు వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్‌కేలకు వెళితే నానో యూరియా ఇస్తామంటున్నారని, కానీ వాటిని వినియోగించే తీరు రైతులకు అర్థం అవక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డిమాండ్ మేరకు రైతులకు యూరియా సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, రైతు సంఘం మండల కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, ప్రజా సంఘాల నాయకులు జి.ఎల్.నరసింహులు, సాంబశివ, బాబ్జాన్, ఉదయ్‌కుమార్, రఫీ, జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ జల పొదుపు దినోత్సవం

తలుపుల : మండలంలోని గొల్లపల్లితండాలో ప్రపంచ జల పొదుపు దినోత్సవాన్ని గురువారం జేవీవీ పర్యావరణ కన్వీనర్ గంగాధర్‌నాయక్ ఆధ్వర్యంలో రైతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నీటి పొదుపుగా వాడుకోవాలన్నారు. ప్రతి నీటి చుక్క భూముల్లోనే ఇంకేలా వాలుకు అడ్డంగా గోతులు తవ్వడం, ఫారంపాండ్లు, చుట్టూ ట్రెంచ్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

కందిలో చీడపీడలు నివారించుకోండి


కంది పంటను పరిశీలిస్తున్న ఏరువాక కోఆర్డినేటర్, అధికారులు

పుట్టపర్తి అర్బన్: ఖరీఫ్ కింద సాగు చేసి కంది పంట ప్రస్తుతం 60 నుంచి 90 రోజుల వరకూ వయస్సు ఉందని, చీడపీడల నివారణ కోసం మందులు పిచికారీ చేసుకోవాలని ఏరువాక కేంద్రం కోర్డినేటర్ డాక్టర్ కే. రామసుబ్బయ్య పేర్కొన్నారు. గురువారం ఇరగరాజుపల్లిలో కంది పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంది 60 రోజులకు, 90 రోజులకు ఓమైట్ ఒక ఎంఎల్ లేదా గంధకం మూడు గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పంట ఏపుగా పెరగడానికి పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కంది పంటలో మొక్క మొక్కకూ మధ్య 20 సెంటీమీటర్లు ఉంచి తక్కిన వాటిని తొలగిస్తే కొమ్మలు ఎక్కువగా వచ్చి దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ఆనంద్‌నాయక్, విలేజ్ అసిస్టెంట్ సూర్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

వెలుగు సీసీ అవినీతిపై విచారణ జరిపించండి


వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు, మహిళా సంఘాల సభ్యులు

పుట్టపర్తి అర్బన్: బుక్కపట్నం వెలుగు కార్యాలయంలో పనిచేసే సీసీ రవీంద్ర అవినీతిపై విచారణ జరిపించాలని సీపీఎం నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం నాయకులతో కలిసి డీఆర్‌డీఏ కార్యాలయంలో ఏపీ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుక్కపట్నం స్త్రీ శక్తి భవన్‌లో పని చేసే సీసీ రవీంద్ర మహిళా సభ్యులతో అసభ్యంగా ప్రవర్తిస్తారని, రుణ కంతుల కోసం రూ. 5 వడ్డీతో రుణాలు ఇచ్చి ఆలస్యమైతే ఇబ్బందులకు గురి చేస్తారన్నారు. మహిళలు ప్రశ్నిస్తే రుణాలు ఇవ్వడంలో ఇబ్బందులు పెడతాడన్నారు. ఇటీవల అతడిని ప్రశ్నించిన సీపీఎం నేత వెంకటేష్‌పై దాడి చేసి గాయపరిచాడన్నారు. అతనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎం పట్టణ కార్యదర్శి బ్యాళ్ల అంజి, మహిళా సంఘాల నాయకులు శాంతమ్మ, నాగజ్యోతి, సుభద్రాబాయి, షాహీన, జయంతి, అశ్వని, మునీర పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి


మాట్లాడుతున్న రామకృష్ణ

కదిరి అర్బన్: ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. కుమ్మరవాండ్లపల్లి హమాలీక్వార్టర్స్‌లో పేదలు వేసుకున్న గుడిసెలను గురువారం పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుమ్మరవాండ్లపల్లిలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 720లో గత నాలుగునెలలుగా పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని, వారందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జీఎల్ నరసింహులు, జగన్మోహన్, సాంబశివ, రామ్మోహన్, బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా ఉద్యమ్ ఆధార్ సర్టిఫికెట్

తాడిమర్రి: చిరు వ్యాపారుల కోసం ఈనెల 20న వెలుగు కార్యాలయంలో ఉచితంగా ఉద్యమ్ సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు ఏపీఎం సాంబశివుడు సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా పరిశ్రమల శాఖ సహకారంతో కళాజ్యోతి మండల సమాఖ్యలో వివిధ రకాల వ్యాపారాలు చేస్తున్న పురుషులు, మహిళలకు ఉద్యమ్ ఆధార్ సర్టిఫికెట్‌ను ఉచితంగా ఇస్తామన్నారు. మండలంలో గ్రామాల్లోని ప్రతి యానిమేటర్ తమ గ్రామాల్లోని చిరువ్యాపారులను శనివారం పిలుచుకురావాలని కోరారు.

జానపద నృత్య ప్రదర్శనలో విద్యార్థినుల ప్రతిభ

ధర్మవరం అర్బన్: ప్రపంచ జానపద నృత్య ప్రదర్శనలో లయోల హైస్కూల్ విద్యార్థినులు ప్రతిభ చూపారని పాఠశాల కరస్పాండెంట్ శంకర్‌నాయుడు తెలిపారు. పట్టణంలోని లయోల పాఠశాలలో గురువారం ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను కరస్పాండెంట్ అభినందించారు. సెప్టెంబర్ 15న అనంతపురం లలిత కళా పరిషత్‌లో రంగస్థల సకల వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం నిర్వహించిన ప్రపంచ జానపద నృత్య ప్రదర్శనలో పాఠశాల విద్యార్థినులు శాన్విత, ఆరాధ్య ప్రతిభ చూపారన్నారు.